ఆనందరావుని ఆ స్థితిలో చూసిన నాకు "యితనికేదైనా జబ్బు చెయ్యలేదు కదా?" అని భయం వేసింది.

"అదేవిటి అలా వున్నావ్? అరుణ రాలేదా? ఒంట్లో బాగో లేదా? అంతా కులాసాగా ఉన్నారా? సంగతేమిటి మాట్లా దవేం?" అని గబగబా అతన్ని ప్రశ్నల్తో కుదిపేశారు మా వారు.

అతనీ శలవులో ఉన్న దగ్గర్నుంచి ఏ జరిగిందీ మాకు తెలీదు. ఉత్తరాలు రాసే అలవాటు మాకు లేదు.

కుర్చీలో కూలబడి రెండు చేతుల్తోనూ మొహం కప్పుకున్న అతన్ని చూసిన నాకు కాళ్ళు గజగజ వణికేయి. కొంపతీసి అరుణకేమైనా..

ఆ తరువాత ఆలోచించడానికి నా మనస్సు ఒప్పలేదు.

"అరుణేదిరా?" కసిరినట్టే అడిగేరు మా వారు.

ఆనందరావు జవాబుగా ఓ కాయితం చేతిలో పెట్టాడు. అది చదివిని మా వారు.

"ఓరి ఫూల్!" అని మాత్రం అనగలిగేరు.

నేనూ చదివేను ఆ కాగితం, అందులో...

"మీరు హరిశ్చంద్రుడైతే నాకభ్యంతరం లేదు కాని నేను చంద్రమతిని కాలేను!"

అన్న రెండు లైన్లే ఉన్నాయి.

నేను, మా వారు చెరో కుర్చీలో కూలబడ్డాం.

కథంతా విన్నాక ఆనందరావుని చూసి అపరిమితమైన జాలి వేసింది.

అరుణని తల్చుకుని ఏడుపూ వచ్చింది.

**(1981)**

# డెడ్ కాపిటల్

"గొడ్డయినా మనిషిని నమ్ముతుంది కాని, ఈ సుందరమ్మ తల్లి మాత్రం దేవుడితో సహా ఎవర్నీ నమ్మదు. నా తల్లి ఏ ముహూర్తాన పుట్టిందోకాని", అన్నది మా వారి కామన్ కంప్లయింట్.

అది గొడ్డు కొబట్టే నమ్ముతుంది.

ఇంతకీ నా నమ్మకంతోగాని, అపనమ్మకంతోగాని అయనకేం అసంబంధం లేదు. ఆయన నమ్మకానికి కాలమానం ఒకటే. గురూగారూ అనే ప్రతి ప్రాణినీ ఆయన తన శిష్యకోటిలో చేర్చేసుకుంటారు. ప్రతి శిష్యుణ్నీ ఆయన నమ్ముతారు.

దేవుడికి భక్తులంతా ఒకటి ఔనో కాదో కాని నా పతి దేవునికి మాత్రం అంతా ఒకటి కాదు.

అతి ముఖ్యులు, అముఖ్యులు, ముఖ్యులు యిలా రకరకాలు, అందులో ప్రమోషను, డిప్రమోషను కూడా వుంటారు.

నిజానికి మా వారి శిష్య పరమాణువుల్ని నేనంతగా పట్టించుకోను. వాళ్ళూ నన్ను పట్టించుకోరు, ఏదో గురుపత్నిగా ఓ నమస్కారం పారేస్తారు అంతే. అయితే ఒక్క సంగీతరావంటే మాత్రం నాకెందుకో.

అతను నన్నుప్పుడూ అగౌరవ పరచలేదు. సరికదా అందరి కంటే ఓ నమస్కారం ఎక్కువే పెడతాడు. పైగా అప్పుడప్పుడు "మీరు చాలా బాగా ఎంబ్రాయిడర్ చేస్తారనీ, మీ వంట అమోఘం అనీ పొగుడుతాడు కూడా. అయినా అతనంటే నా కెందుకో అంత సదభిప్రాయం లేదు. దానిక్కారణం బహుశా అతను మా వారికి పక్క వాయిద్యం అవడంవల్లనేమో.

అబ్బ! గురూగారూ! అదిరిపోయిందనుకోండి. ఈ పెన్సిలు ఎక్కడ కొన్నారోగానీ ఓ డజను తేలేకపోయారా? అన్నాడు మా వారి దగ్గరున్న పెన్సిలు ముక్క చూసి.

దానికి మావారు శంకరుడిలా పొంగిపోయి "అదా... అదీ ... ఢిల్లీలో పేవ్‌మెంట్‌మీద కొన్నాను. డెడ్‌చీప్. రూపాయి పావలా. ఇది మీరు కావలిస్తే తీసుకోండి. నాకింకోటుంది. అని దాన్ని మాంత్రికుడు శిష్యుడికి మంత్రదండం యిస్తున్నంత జాగ్రత్తగా ఇచ్చేరు. అతనూ అంత భక్తిగానూ అందుకున్నాడు దాన్ని.

దాని ధర మా వూళ్ళో అర్ధరూపాయి.

మరోసారి అబ్బ! గురూగారూ! అంత వయసొచ్చినా ఏం కెపాసిటీ బాబూ మీది సోడా కూడా అదక్కుండా హాఫ్ బాటిల్ హూత్ అనిపించేశారు. మేమూ వున్నాం ఎందుకూ? రెండో రౌండుకి ఆఫ్ అన్నాడు మందుగ్లాసులో సోడా వేసుకుంటూ.

అంతే మా వారిలో శంకరుడు శివమెత్తేడు. ఆ తరువాత మిగతా హాఫ్ బాటిల్ గ్లాసు కూడా అదక్కుండా గడగడ లాడించేరు. ఆఫ్‌కోర్సు ఆ తరువాత రెండ్రోజులు మంచం దిగలేదు. అది వేరే సంగతి. నాకెందుకో మనం చేసే ప్రతి పనీ పొగిడేవార్ని నమ్మాల నిపించదు.

తల్లి – పిల్లకైనా, మెగుడు – పెళ్ళానికైనా ఆఖరికి యిద్దరు ఫ్రెండ్సుకైనా అన్ని అభిప్రాయాలూ, అభిరుచూల కలియవు. కలవాలన్న రూలూలేదు. మరింక మనం మాట్లాడిన ప్రతి మాటకీ వన్స్‌మోర్ కొట్టి, చేసే ప్రతిపనీ శెభాస్ అనే వాళ్ళంటే నాకంత సదభిప్రాయం వుండదు.

సంగీతరావు ఈ కోవకే చెందుతాడని నా అంచనా, నా అంచనా తప్పుకాదడానికి సాక్ష్యం...

ప్రతి ప్రాణి తిండి, గుడ్డ తరువాత కోరుకొనేది తలదాచుకోవ డానికి ఓ గూడు.

ప్రతి పక్షికి స్వంత గూడుంటుంది.

ప్రతి పాముకీ ఓ పుట్ట వుంటుంది.

అలాంటిది మనిషినైన నేను ఓ స్వంత ఇల్లు కోరుకొనడంలో తప్పు లేదు, అసహజం అంతకన్నా కాదు. కాకపోతే మావారికి ఇల్లంటే ఇష్టంలేదు.

నీ మొహం, ఇల్లు పరమ డెడ్‌కేపిటల్. యింటిమీద వచ్చే అద్దె, అప్పుచేసిన డబ్బుకి వడ్డీక్కూడా గిట్టదు. యిల్లు కట్టడాలు ఎవరికనుకున్నావ్. బ్లాక్ మనీ మూలిగేవాళ్ళకి, మనక్కాదు" అని ఎప్పటికప్పుడు కొట్టిపారేసే ఆయన అమాయకత్వానికి నవ్వాలో, తెలివితక్కువ తనానికి తన్నాలో తెలీలేదు నాకు.

అసలు. కేపిటల్ అనేది వుంటే కదా–అది డెడ్. లైవ్ అయేది? ఎక్కడో అప్పుతెచ్చి కడతాం. ఆ యింటిమీద వచ్చే అద్దెతో ఆ అప్పుతీరి, మనం రిటైరయ్యేనాటికి యిల్లు మిగులు తుంది. అప్పుడు కేపిటల్ యిల్లు రూపంలో ఉంటుంది. కాని మా వారిలో ఆర్గుమెంటు చెప్పడం అంత బుద్ధితక్కువ మరోటి లేదు మరింక స్వంత యిల్లు అన్న మమకారం చంపేసుకున్నాను.

సాధారణంగా మనుషుల అభిప్రాయాలు మారుతూనే ఉంటాయి. కాని మా వారి విషయంలో మాత్రం ఆయనకొక ఖచ్చితమైన అభిప్రాయం అంటూ ఉండదు. యథాశిష్యా తథాగురు అనక తప్పదు.

చూడూ. సుబ్రమణ్యం చెప్పేడు. రోజూ పొద్దున్నే చెమ్చాడు తేనె గ్లాసుడు నీళ్ళలో కలిపి తాగితే చాలా మంచిదిట. అని గిరిజన్ స్టోర్సులో ఓ కిరసనాయిలు సీసాడు తేనె తెచ్చేరు ఓనాడు. తేవడమే కాకుండా పిల్లలందర్నీ తాగమని ఆర్డరు వేశేరు.

ఓ వారం అయేక, ఔనూ, అతనేవిటి అలా చెప్పేడే? ఈవేళ సత్యనారాయణ చెప్పేడే తేనె హార్టుమీద దెబ్బకొడుతుందిట నయం. వేగమే మేలుకున్నాం. అని ఆ మిగిలిన తేనె పని మనిషికో, పాల మనిషికో యిచ్చేశారు.

ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. అసలు సంగతి..

ఆ వేళ సుబ్బారావు – అతన్ని మేము సైక్లోను సుబ్బారావు అంటాం. ఓసారి బ్రహ్మాండమైన తుఫానువచ్చి భూమీ ఆకాశం బద్దలైపోతుంటే, సరిగ్గా ఆ టైములో వచ్చి తన ఉద్యోగం రికమం డేషను కోసం మావార్ని కారులో అదేదో ఊరు తీసుకెళ్ళేడు. బతికుంటే కదటయ్యా ఉద్యోగం తుఫాను తగ్గేక వెళ్ళండి అని మా నాన్న ఎంతచెప్పినా వినకుండా యిద్దరూ వెళ్ళేరు. వాల్ళు తిరిగివచ్చేవరకు మాకెవరికీ మనశ్శాంతి లేదు. వాళ్ళారాత్రి ఎన్ని ఎడ్వంచర్సు చేశారో మావారు ఇప్పటికీ కథలుగా చెప్తూ వుంటారు. అందుగో అప్పటినుంచే అతన్ని మేం సైక్లోను సుబ్బా రావు అంటాం. అతను వచ్చి గురూగారూ, ఫలానా కాలనీలో యింకా కొన్నిస్థలాలు మిగిలిపోయేయి, మీరొకటి తీసుకోండి. యిల్లు వాళ్ళే కడతారు. అంతగా మనకి వద్దనుకుంటే యెప్పుడుపడితే అప్పుడే అమ్ముకోవచ్చును. ఎప్పుడు అమ్మినా మనం కట్టినదానికి ఓ రెండువేలు యెక్కువే వస్తుంది కాని, నష్టం ఉండదు అని సలహా యిచ్చేడు.

మా వారికి ఆ సలహా నచ్చింది.

అమోఘంగా నచ్చింది.

ఆ సలహా నచ్చుడానిక్కారణం. ఒకటి ఆ సుబ్బారావు మా వారికి అతి ముఖ్యుల్లో అతి ముఖ్యుడు. రెండు : ఆ రెండు వేలు లాభం. ఆయనకి బిజినెస్ అంటే మహా యిష్టం. ఏ బిజినెస్‌కి, ఆఖరికి కిల్లీబడ్డీకైనా సరిపోయే డబ్బు మా దగ్గర లేకపోవడం కేవలం మా అదృష్టం. లేకపోతే ఆయన ఎప్పుడో ఈ ముష్టి ఉద్యోగం మానేసి బ్రహ్మాండంగా బిజినెస్ చేసి చివరికి మా కందరికీ కలిపి ఒకే చిప్ప యిచ్చేవారు.

ఇంతకీ యింట్లో వున్న వెండి, బంగారం, ఉగ్గుగిన్నె, ఉంగ రంతో సహా అన్నీ అమ్మేసి ఓ స్థలం తీసుకున్నారు.

మనుషుల మీదలాగే నాకు నా అదృష్టం మీద కూడా అట్టే నమ్మకం లేదు. అయినా అప్పుడప్పుడు మిరకిల్స్ జరగవా అనుకున్నాను. కాని నా విషయంలో ఏదీ శాశ్వతం కాదు అని మళ్ళీ రుజువవడానికి ఎంతోకాలం పట్టలేదు.

కట్టబోయే యింటిలో ఏఏ మొక్కలు వెయ్యాలో, ఎవరిగది ఎలా ఉండాలో మా పిల్లల ప్లాను పూర్తవనేలేదు. ఈలోగా మా యింజినీర్లు తప్పు ఎస్టిమేట్ చేశారు. మరో నాలుగువేలు కట్టమని సొసైటీవాళ్ళు లవ్‌లెటర్ రాశేరు.

దాంతో మావారు ఆ యింజినీర్లకి లెక్కలు రాకపోవడం మా తప్పా? పొట్టకొస్తే పదో ఎక్కం కూడా లేని ప్రతివాడూ డొనేషన్లు కట్టి యింజినీర్లు అయిపోతే యిలాగే వుంటుంది. అతి గెంతినా మొత్తానికి డబ్బుకట్టేసేరు.

అమ్మయ్య అనుకున్నాం నేను, పిల్లలు

ఇక్కడితో కథ అయిపోతే బాగుండేది. కాని అవలేదు ఓ ఏడాది తరువాత యిదివరకు మేము మీ దగ్గర తీసుకున్న రేటు కంటే రెట్లు పెరిగేయి. అంచేత మరో అయిదువేలు కట్టమని మరో లవ్‌లెటర్ రాశేరు సొసైటీవాళ్ళు.

ఈసారి మావారు శివతాండవం చేసేరు. రేటు పెరిగేవరకూ ఏం చేస్తున్నారు వీళ్ళు? వీళ్ళ బద్దకానికి మేం ఖరీదు కట్టాలా? ఛస్తే కట్టం, అదీగాక ఇప్పుడైనా వెంటనే కడతారన్న గ్యారంటీ ఏమిటి? యిలా అర్నెల్లకోసారి తే,తే అంటే యెక్కడినించి తెస్తాం? అమ్మేస్తాను. పీడా వదిలిపోతుంది. డబ్బు బ్యాంకులో పారేస్తే వడ్డీ అయినా వస్తుంది అన్నారు.

అతనేదో తెలివితక్కువగా అంటున్నాడు కాని యిప్పుడు అమ్మారంటే మరింక కొనలేరు. ఎలాగో తల తాకట్టు పెట్టయినా సరే ఆ డబ్బు కట్టేయండి అని కొంతమంది స్నేహితులు నాకు రహస్యంగా సలహా యిచ్చేరు.

తల తాకట్టు పెట్టడానికి నాకేం అభ్యంతరం లేదుకాని, మావారి నిర్ణయం ఎవరు మార్చగలరు? ఆయన మూడ్ కోసం నేను వెయిట్ చేస్తున్నాను. ఈలోగా వాలేదు సంగీతరావు "గురూగారూ... ఏవిటి అమ్మేస్తానంటున్నారుట. నిజమేనా? ఎలాగో తంటాలుపడి ఉంచేసుకుంటే బావుంటుంది కదా... ఏమిటీ యీ గోల పడలేనంటున్నారా.. అయితే నేను తీసుకుంటాను. ఇంకెవరికీ మాట యివ్వకండి. నా ఇల్లు మీది కాదా? అంటూ...

మావారు తెగ సంతోషించేరు. సంతోషించి ఊరుకోలేదు. చూడూ, నేను కట్టినంతే యియ్యి. ఏవిటీ వడ్డీనా? నేనేం మార్వాడీననుకుంటున్నావా? అసలు యియ్యి చాలు అన్నారు.

నాకు నోట మాట రాలేదు.

హి ఈజ్ ఎ ఫెర్‌ఫెక్ట్ ఫూల్ అన్నారు. మా మంచికోరే కొందరు.

ఆ తరువాత ఓనాడు అతి సంతోషంగా వచ్చేరు గుడ్‌న్యూస్ అంటూ. ముందు మాంచి కాఫీ యియ్యి చెప్తాను అన్నారు.

చెప్పేరు ఏవని?

మొత్తానికి ఫైనలైజ్ చేసేను. వెధవ యింటిగొడవ. ప్రాణం హాయిగా వుంది అన్నారు.

డబ్బు బ్యాంకులో పడెయ్యకపోయేరా? అన్నాను నేను అమ్మిన బంగారం తల్చుకుంటూ. నేను అమ్మిన రేటుకి మూడింతలైంది యిప్పుడు ధర ఆఖరికి కంటె చెడగొడితే ఉంగరం వచ్చింద న్నట్లయింది.

ఫెళ్ళున నవ్వేరు.

నవ్వటం అయిపోయేక మొత్తానికి ఆడగుణం పోలేదు సుమా! నీకు నేను మేనమావని నా పోలికా రాలేదు, నాతో పాతికేళ్లు కాపరం చేశేవు. సావాసదోషమూ అబ్బలేదు... పాపం! అతనిదగ్గర అయిదువేలకి కొంచెం అటో, యిటో ఉందిట. ఏం చేస్తాం? అతనూ మనలాంటి సంసారే. ముందు ఆ డబ్బు ఆ సొసైటీ వాళ్ళ మొహాన పారేస్తానన్నాడు. మనపేర వున్న ఇంటికి అతన్ని డబ్బు కట్టమనడం ఎంత యిన్సల్ట్? అంచేత అతని పేర ట్రాన్స్‌ఫర్ చేశేను. మన డబ్బు నిదానంగా నెలకింత అని తీర్చేస్తాట పాపం. సమయానికి యివ్వవలసిన వాళ్ళు యివ్వలేదుట అన్నారు కాళ్ళూపుతూ.

ఇది జరిగి చాలా ఏళ్ళైంది. ఆ మధ్య మనసు వుండబట్టక డబ్బు సంగతి యెత్తితే యిస్తాడు లెద్దూ అస్తమానూ అలా తోవేఁస్తే ఎలా? అసలు మనిషి గుణం డబ్బు దగ్గరే తెలుస్తుంది. గవర్నమెంటు దగ్గర్నుంచి ఎరియర్సు రావాలిట. రాగానే యిస్తాడు. అసలు మన యింటికి రావాలంటేనే.. ఉహూ ఇదైపోతున్నాడు తెలుసా. సుందరమ్మ గారు ఏవనుకుంటున్నారో , ఏవిటోనని అంటున్న ఆయన్ని ఏవనగలను?

దేవుడికో నమస్కారం పెట్టి వూరుకో అంది మా అమ్మ.

అది కూడా యెందుకూ? దండుగ అన్నారు పిల్లలు.

ఇంతకీ దేవుడు మాత్రం ఏం చేస్తాడు నా పతిదేవుడ్ని?

అందరి సంగతీ నాకు తెలీదు కాని, నా విషయంలో మాత్రం ఇల్లు మా వారన్నట్టు డెట్ కాపిటలే అయింది.

**(ఆంధ్రజ్యోతి, వారపత్రిక 27.3.1981)**